అంగన్‌వాడీలా!

- సొంత భవనాలకు నోచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు
- భవనాలు మంజూరు చేసిన గత ప్రభుత్వం
- కూటమి సర్కార్ పట్టించుకోని వైనం


వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరిలో అర్ధాంతరంగా పనులు నిలిచిపోయిన భవనం


పలాస మండలం మోదుగులపుట్టి గ్రామంలో ఇరుకైన రేకుషెడ్డులో నడుస్తున్న కేంద్రంలో చిన్నారులు

మొత్తం కేంద్రాలు	186
సొంత భవనాలు	52
అద్దెవి	60
అద్దెలేనివి	74
పిల్లలు 3 నుంచి 6 ఏళ్లు	1,894
గర్భిణులు	2,124
బాలింతలు	834

కాశీబుగ్గ: చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతల కోసం పని చేయాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు డీలా పడుతున్నాయి. చాలా కేంద్రాలకు సొంత భవనాల్లేక అద్దె కొంపల్లో, ఇరుకైన గదుల్లో నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో చాలా కేంద్రాలు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. అద్దె భవనాల్లో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కొత్త భవనాలు మంజూరు చేశారు. అయితే తరువాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, తరువాత ఏర్పాటైన కూటమి సర్కార్ వీటి గురించి కనీసం ఆలోచన చేయలేదు. దీంతో ఎక్కడ నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి.

నిధులు మంజూరైన జరగని నిర్మాణాలు

కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో పలాస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో పలాస మండలం దానగోర, మోదుగులపుట్టి, మహాదేవిపురం, ఈదురాపల్లి, పెద్దనారాయణపురం, వజ్రపుకొత్తూరు మండలంలోని అనంతగిరి, బాతుపురం, కొండవూరు, ఎంఎన్‌పేట, పీఎంపురం, రాజాంలోని కేంద్రాలకు నూతన భవనాలను కేటాయించారు. వీటి నిర్మాణానికి ఒక్కో కేంద్రానికి రూ.13 లక్షల నుంచి 14 లక్షల రూపాయల చొప్పున నిధులు మంజూరు చేశారు. అయితే వీటిలో ఒక్క భవనం కూడా నిర్మాణానికి నోచుకోలేదంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పలాస మండలం దానగోర అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఎనిమిది మంది చిన్నారులు, నలుగురు గర్భిణులు, ఇద్దరు బాలింతలు ఉన్నారు. ఈ కేంద్రం అద్దె గదిలో నడుస్తోంది. రూ.500 అద్దె చెల్లిస్తున్నప్పటికీ మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం కూడా లేకుండా అధ్వానంగా ఉంది. కనీసం చాపలు లేకుండా పిల్లలు నేల మీద కూర్చునే పరిస్థితి. చాలా కేంద్రాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు, పాలకులు దృష్టిసారించి అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు కేటాయించి సకాలంలో పూర్తి చేయాలని కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం

ఇప్పటి వరకు నిధులు విడుదలైన మేరకు భవన నిర్మాణ పనులు జరిగాయి. ప్రభుత్వం మారింది. సమస్యను పీవో దృష్టికి తీసుకెళ్లాం. ఏ భవనాలు పెండింగ్‌లో ఉన్నాయో జేఈ వారికి వివరాలు సేకరించమని అప్పగించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పనులు ప్రారంభించి బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందుబాటులోకి తీసుకువస్తాము. – కె.పార్వతి, సీడీపీవో, కాశీబుగ్గ

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల నియామకం

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీలో పలువురిని నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. యువజన విభాగం అధ్యక్షునిగా చిన్ని జోగారావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా గొండు చాందిని, రైతు విభాగం అధ్యక్షునిగా బగాది దివాకర్, బీసీ సెల్ అధ్యక్షునిగా పేడాడ వెంకట్రావు, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా కర్నిక జీవన్‌రావు, ఎస్టీ సెల్ అధ్యక్షునిగా బొడ్డపాటి తిరుపతిరావు, మైనారిటీ సెల్ అధ్యక్షునిగా నర్సింగ్ నాథ్ సాబతో, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షునిగా ఆట్ల రాహుల్‌కుమార్, విద్యార్థి సంఘం అధ్యక్షునిగా నక్కిట్ల నరేష్, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షునిగా పోలాకి మోహన్‌రావు, సమాచార హక్కు చట్టం విభాగం అధ్యక్షునిగా దాడి ధర్మారావు నియమితులయ్యారు. అలాగే వలంటీర్స్ విభాగం అధ్యక్షునిగా సుంకరి జనార్దనరావు, గ్రీవెన్స్ సెల్ విభాగానికి ఉప్పాడ తమ్మయ్య, వాణిజ్య విభాగానికి వారణాసి గోవిందరాజు, చేనేత విభాగం అధ్యక్షునిగా మొర్రి శంకర్, అంగన్‌వాడీ విభాగానికి రేగల లక్ష్మీకాంతం, లీగల్ సెల్‌కు లుండ బాలకృష్ణ నియమితులయ్యారు. సాంస్కృతిక విభాగం అధ్యక్షునిగా పైల కరుణాకర్‌రావు, సోషల్ మీడియా విభాగం అధ్యక్షునిగా బొల్ల మోహన్‌రావు, ఐటీ విభాగం అధ్యక్షునిగా మన్నేల కిశోర్, దివ్యాంగుల విభాగం అధ్యక్షునిగా హనుమంతు లక్ష్మణరావు, డాక్టర్ సెల్ అధ్యక్షునిగా గేదెల చంద్రరావు, ప్రచార విభాగం అధ్యక్షునిగా అంగ మహేష్, బూత్ కమిటీ అధ్యక్షుడుగా సింగుపురం వినోద్, మేధావుల ఫోరం అధ్యక్షునిగా జీ.వి.రెడ్డి మాస్టారును నియమించారు.

విశ్రాంతి మండపం నిర్మాణానికి శంకుస్థాపన


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: జాడుపూడి గ్రామంలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. నాలుగు లక్షల అంచనా వ్యయంతో మంజూరు చేసిన ప్రజా విశ్రాంతి మండపం నిర్మాణానికి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. స్థానిక సర్పంచ్ పలికల దాక్షాయణి, నాయకుడు జయరాం, ఎంపీటీసీ సభ్యురాలు జామి జయ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, పార్టీ నేతలు లడ్డు కేశవపాత్రో, దుర్గాసి ధర్మారావు, పెద్దశ్రీరాంపురం సర్పంచ్ బల్లెడ సుమన్, నేతలు పిలక సోమేశ్వరరావు, జామి నూకయ్య, తలగాన తిరుపతిరావు ఉన్నారు.

కార్మికుల పిల్లలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ఇచ్ఛాపురం రూరల్: చదువుకు దూరంగా ఉన్న ఇటుకబట్టీ కార్మికుల పిల్లలకు విద్యాశాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి కురమాన అప్పారావు అన్నారు. బుధవారం ఆయన జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల ప్రతినిధి పూడి జనార్దనరావుతో కలిసి మండలంలోని ఇటుకబట్టీలను పరిశీలించి చదువుకు దూరంగా ఉండే బాలలను గుర్తించారు. త్వరలో నాన్ రెసిడెన్సీ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. పిల్లలను పనిలో పెట్ట కూడదని, బాలికలకు బాల్య వివాహాలు చేయరాదని కార్మికులకు అవగాహన కల్పించారు. లేబర్ ఆఫీసర్ ఎం.విజయకుమార్, బ్రిడ్స్ కోఆర్డినేటర్ ఎం.స్వాతి, సీఆర్పీలు తులసీరావు, సత్యన్నారాయణ ఉన్నారు.


ఇటుకబట్టీల వద్ద అధికారులు

ఏరియా పశువైద్యశాల సందర్శన


రికార్డులు పరిశీలిస్తున్న రాజగోపాలరావు

కాశీబుగ్గ: పలాసలోని ఏరియా పశువైద్యశాలను జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.రాజగోపాలరావు బుధవారం సందర్శించారు. సిబ్బంది పనితీరు, పశు ఆరోగ్య శిబిరాల గురించి ఆరాతీశారు. అనంతరం పశువుల వ్యాధుల నిర్ధారణ ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. మామిడిపల్లి గ్రామంలో పర్యటించి పశువైద్య శిబిరాలపై ఆరా తీశారు. జిల్లా ఐఎస్‌డీపీ ఈడీ డాక్టర్ బి.యోగేశ్వరరావు, డాక్టర్ పోతనపల్లి చంద్రశేఖరరావు, వి.ఎ.ఎస్. డాక్టర్ కె.మధుబాబు ఉన్నారు.

ఉపకరణాల కోసం 228 మంది పేర్లు నమోదు


ఉపకరణాల గుర్తింపును పరిశీలిస్తున్న అధికారులు

టెక్కలి: టెక్కలి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డివిజన్ స్థాయిలో నిర్వహించిన దివ్యాంగుల సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరంలో డివిజన్ పరిధిలో 228 మంది దివ్యాంగులు పేర్లను నమోదు చేసుకున్నారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత, ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీబాయి తదితరులు శిబిరాన్ని పరిశీలించారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వలంటీర్లుగా సహకారం అందజేశారు.

సంక్షిప్తంగా..

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

కాశీబుగ్గ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన పలాస మండలం లొద్దబద్ర గ్రామం వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గొప్పిలికి చెందిన బాలరాజు, నందిగాం మండలం దీనబంధాపురం గ్రామానికి చెందిన ధర్మారావులు ద్విచక్ర వాహనంపై గొప్పిలి నుంచి పలాస వైపు వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ధర్మారావుకు తీవ్రగాయాలవడంతో స్థానికుల సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది సత్యం, శ్రీనివాసరావులు అత్యవసర చికిత్స అందించి పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలిచారు.

'తూతూ మంత్రంగా దర్యాప్తు'

టెక్కలి: టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి ఆనుకుని ఉన్న పంచాయతీ స్థలంలో ఆక్రమణలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును పట్టించుకోకుండా పంచాయతీ అధికారులు తూతూ మంత్రంగా దర్యాప్తు చేస్తున్నారని మేజర్ పంచాయతీకి చెందిన వార్డు సభ్యుడు దాడి ధర్మారావు విమర్శించారు. బుధవారం దర్యాప్తు చేయాల్సి ఉండగా ఫిర్యాదు చేసిన తనకు ఆలస్యంగా సమాచారం అందజేయడమే కాకుండా ఎటువంటి విచారణ చేయలేదన్నారు. పంచాయతీ స్థలంలో ఆక్రమణదారులకు అధికారులు అండగా నిలుస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

రేపటి నుంచి సీతారాముల ఆలయ ప్రతిష్ఠ

కాశీబుగ్గ: మందస మండలం బిన్నలమదనాపురం గ్రామంలో ఈ నెల 31 నుంచి వచ్చే ఫిబ్రవరి రెండో తేదీ వరకూ సీతారామస్వామి వారి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని నిర్వహణ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించి విజయవంతం చేయాలని కోరారు.

నేడు పలాసలో దివ్యాంగుల గుర్తింపు శిబిరం

పలాస: పలాస మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం పది గంటలకు దివ్యాంగుల సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఎం.పీడీవో కె.వసంతకుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పలాస రెవెన్యూ డివిజన్‌లోని ఎనిమిది మండలాలకు చెందిన దివ్యాంగులంతా శిబిరానికి హాజరై తగిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం

టెక్కలి: టెక్కలి ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో టెక్కలి, నందిగాం మండలాల్లో కల్లుగీత సామాజిక వర్గం వారికి కేటాయించిన రెండు మద్యం దుకాణాల ఏర్పాటు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఐ షేక్ మీరా సాహెబ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెక్కలి మండలంలో శెగిడి, నందిగాం మండలంలో శ్రీశయన కులస్తులకు దుకాణాలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా రెండు లక్షల రూపాయల చలానాతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, నివాస పత్రాలతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి

పలాస: గత ప్రభుత్వం మంజూరు చేసి మధ్యలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ సోషల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక అధికారి చెన్నూరు మల్లేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2019 నుంచి 2024 మధ్యలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేవారికి బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఎవరికైనా సందేహాలు ఉంటే 99492 56501 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మూడు మండలాల్లో విద్యుత్ కోత రేపు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గం పరిధిలోని మూడు మండలాల్లో ఈ నెల 31వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని పలాస డివిజన్ ఎగ్జిగ్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ఉన్న 132 కేవీ లైన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఆ రోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కాలువ నిర్మాణానికి భూమిపూజ

కవిటి: కపాసుకుద్దిలో కాలువల నిర్మాణానికి ఎంపీపీ కడియాల పద్మ భూమిపూజ చేశారు. గ్రామపంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 5 లక్షలు, మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నుంచి రూ. 2.5 లక్షలతో కాలువలు నిర్మిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆమె చెప్పారు. సర్పంచ్ కాయ దమయంతి, ఎంపీటీసీ సభ్యురాలు తడక పార్వతి, వైఎస్సార్‌సీపీ నేతలు కడియాల ప్రకాష్, వై.అశోక్, వై.నీలయ్య, పి.శ్రీరాములు, పి.చంద్రశేఖరం ఉన్నారు.

క్లుప్తంగా

కంచిలిలో ఎమ్మెల్సీ కార్యాలయం


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో శాసన మండలి సభ్యుడు నర్తు రామారావు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు కార్యాలయం ఏర్పాటు పనులను బుధవారం పరిశీలించారు. వచ్చేనెల నాలుగో తేదీన రథసప్తమి సందర్భంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. పరిశీలనలో రామారావుతోపాటు ఆయన సతీమణి, మాజీ ఎంపీపీ చామంతి, మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి క్రిష్ణారావు ఉన్నారు.

'వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల వార్డులపై కక్షసాధింపు'


మాట్లాడుతున్న శర్వాణ గీత

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో మున్సిపల్ అధికారులు కక్ష సాధిస్తున్నారని పదో వార్డు కౌన్సిలర్ శర్వాణ గీత ఆరోపించారు. బుధవారం కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడారు. వార్డులో అభివృద్ధి పనులు జరగకుండా కొర్రీలు పెడుతున్నారని, రోడ్డు పనుల పేరుతో కొందరి ఇంటి అరుగులనే తొలగిస్తున్నారన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రోడ్డు పనులు జరగకుండా ఆటంకాలు సృష్టిస్తున్నారన్నారు. కూటమి నాయకుల మాటలను అధికారులు విని ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నామినేటెడ్ పదవుల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలి


అచ్చెన్నాయుడును కలిసిన బీజేపీ నాయకులు

టెక్కలి: జిల్లాలో నామినేటెడ్ పదవుల్లో బీజేపీ నాయకులకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.తేజేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంత్రి అచ్చెన్నాయుడును కోటబొమ్మాళిలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లా సమస్యలను పరిష్కరించాలని, బీజేపీ కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఎ.రవిబాబ్జి, ఎస్.లక్ష్మీనారాయణ, జె.రామ్‌జీ, ఎ.కామరాజు, భాగ్యలక్ష్మి, జె.పరమేశ్వర్, బి.నరేంద్ర ఉన్నారు.

రుణాల రికవరీకి నోటీసులు


నోటీసులు అందజేస్తున్న అధికారులు

పలాస: మామిడిపల్లి గ్రామంలో గొర్రెల పెంపకదారుల సంఘం ఆధ్వర్యంలో 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించకపోవడంతో బుధవారం పశుసంవర్ధక శాఖ అధికారులు సంబంధిత వ్యక్తుల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. తీసుకున్న రుణాలను వెంటనే చెల్లించకపోతే ఆస్తులను జప్తు చేస్తామని చెప్పారు. ఇంతకీ ఆ రుణాలను తీసుకున్న ఎవరికీ మేకలు గొర్రెలు లేవని తెలుసుకొని అధికారులు ఆశ్చర్య పోయారు. ఇంతవరకు ఒక్క వాయిదా కూడా చెల్లించకపోవడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులు ఇచ్చిన వారిలో గొర్రెల పెంపకదారుల సంఘం జిల్లా డైరెక్టర్‌తో పాటు పలాస పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు పి.చంద్రశేఖరరావు, పశుసంవర్ధక శాఖ వైద్యులు కె.మధుబాబు ఉన్నారు.

జగనన్న కాలనీ సమస్యలను పరిష్కరించాలి


జగనన్న కాలనీలోని ఇంటిని పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామం సమీపంలో గత ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలోని ఇళ్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న ఇళ్లకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యుత్ మీటర్లను ఉచితంగా సమకూర్చితే.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రూ. 1900 నుంచి రూ. మూడు వేలు వరకు తీసుకోవడం దారుణమన్నారు. అలాగే గతంలో ఏర్పాటు చేసిన మీటర్లకు సైతం డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

మౌని అమావాస్య పూజలు



కవిటి మండలంలోని వివిధ గ్రామాల్లో మౌని అమావాస్య సందర్భంగా ప్రజలు అమ్మవారి ఆలయాలు, శివాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాలపేటలో వెలసిన మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో శివమండల దీక్షలు స్వీకరించిన స్వాముల ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం రుద్రహోమాన్ని జరిపారు. కవిటిలోని చింతామణి అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, దీపాలంకరణ సేవలు చేశారు. – కవిటి

కుంకుమార్చనలు..



సంతబొమ్మాళి మండలం బోరుభద్రలోని పాలపోలమ్మ తల్లి ఐదో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం కుంకుమ పూజలు నిర్వహించారు. వేదపండితులు శ్రీనివాసశర్మ, ఆదిత్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు ముగ్గులు ఇచ్చి పూజలు చేశారు. – సంతబొమ్మాళి

శిష్టు గోపికి అభినందనలు



పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడుగా శిష్టు గోపి నియమితులయ్యారు. దీంతో ఆయన్ని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్వగృహంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్‌లు బుధవారం అభినందించారు. 19వార్డు కౌన్సిలర్‌గా, పట్టణ స్పోక్స్‌పర్సన్‌గా సేవలు అందించిన గోపి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. స్థానిక నాయకుడు బడగల బల్లయ్యనాయుడు ఉన్నారు. – కాశీబుగ్గ

పోలీసుల తనిఖీలు..



టెక్కలి మండలంలోని చాకిపల్లి, కె.కొత్తూరు గ్రామాల్లోని పలు దుకాణాల్లో, ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న షాపుల్లో టెక్కలి ఎస్సై కె.రాము ఆధ్వర్యంలో సిబ్బంది పోలీసు జాగిలంతో బుధవారం తనిఖీలు చేపట్టారు. నిషేధిత మత్తుపదార్థాల విక్రయాలు ఏమైనా జరుగుతున్నాయా అనే ఉద్దేశంతో తనిఖీలు చేపట్టామని ఎస్సై చెప్పారు. మాదక ద్రవ్యాలు, మద్యం వంటివి విక్రయించే వారిపై తగుచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. – టెక్కలి రూరల్

విద్యార్థినికి బహుమతి ప్రదానం


టెక్కలి: బహుమతి అందుకుంటున్న రోహిణి

టెక్కలి: టెక్కలి ఎస్టీ మేనేజ్‌మెంట్ బాలికల వసతి గృహం ఇంటర్ విద్యార్థిని సొడంగి రోహిణికు బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఆడపిల్లలను రక్షిద్దాం...ఆడపిల్లల్ని చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా బహుమతి ప్రదానం చేశారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ గత ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో హెచ్ఈసీ విభాగంలో జిల్లా టాపర్‌గా నిలిచింది. దీంతో ఆమెను అభినందిస్తూ ఎమ్మెల్యే గొండు శంకర్, డీఈవో తిరుమలచైతన్య, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ సమక్షంలో రోహిణిని అభినందించి బహుమతి అందజేశారు.


కాశీబుగ్గ: బహుమతి అందుకుంటున్న మౌనిక

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని నెయ్యిల మౌనికకు గుర్తింపు దక్కింది. శ్రీకాకుళంలో బుధవారం జరిగిన బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో రూ.2,500 నగదు బహుమతి, జ్ఞాపికను అధికారులు అందజేశారు. ఈమె ప్రథమ సంవత్సరంలో 426 మార్కులు సాధించినందున బహుమతి వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహమూర్తి తెలిపారు.

రోడ్డు భద్రత సామాజిక బాధ్యత

- టెక్కలి ఎంవీఐ సంజీవరావు

టెక్కలి: ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రహదారి భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడపడం ప్రతీ ఒక్కరి సామాజిక బాధ్యతని టెక్కలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా టెక్కలి ఆర్టీసీ డిపోలో వివిధ విభాగాల ఉద్యోగులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు ఎంతో సురక్షితమన్నారు. బస్సులో ప్రయాణించే ప్రయాణికులను కుటుంబ సభ్యులుగా భావించి వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే విధంగా ఏకాగ్రతతో వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం ఎంవీఐను డిపో సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సీఐ ఎ.విజయ్‌కుమార్, డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.


ఎంవీఐ సంజీవరావును సన్మానిస్తున్న డిపో అధికారులు

జనన ధ్రువీకరణ పత్రాల్లో తప్పులను సరిచేయాలి


సమీక్షలో ఆర్డీవో వెంకటేష్ తదితరులు

పలాస: పలాస రెవెన్యూ డివిజన్‌లో విద్యార్థుల జనన ధ్రువీకరణ పత్రాల్లో చాలా తప్పులు ఉన్నాయని.. వాటిని వెంటనే సరిచేయాలని ఆర్డీవో జి.వెంకటేష్ సిబ్బందిని ఆదేశించారు. పలాస తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డివిజన్ పరిధిలోని అన్ని మండలాల రెవెన్యూ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అపార్ ఐడీ కోసం విద్యార్థుల జనన ధ్రువీకరణ పత్రాల కోసం పెట్టుకున్న సుమారు 20 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో ఒక్క రోజులోనే నాలుగు వేలు పరిశీలించి పరిష్కరించినట్టు చెప్పారు. మిగతావి కూడా పరిష్కరించాలని.. అందుకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో పలాస తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.